క్లుప్తంగా

మట్టి నమూనా సేకరణపై అవగాహన



మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామంలో ఆచార్య ఎన్జీ రంగ విశ్వవిద్యాలయం, బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు గ్రామీణ కృషి అనుభవం కార్యక్రమంలో భాగంగా రైతులకు మట్టి నమూనా సేకరణపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మట్టి నమూనా తీసే విధానంతో పాటు పరీక్షల వలన కలిగే లాభాలపై రైతులకు వివరించారు. భూసార పరీక్షల ఆధారంగా సాగు చేపడితే సాగు వ్యయం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థినులు టీ రేణుక, జే సుమలి, కేవీ కృష్ణవేణి, బీ వర్షిణీస్వరాజ్, రైతులు పాల్గొన్నారు.

రహదారి స్థలం కబ్జాకు గురైందని ఆందోళన

సత్తెనపల్లి: పట్టణంలోని 10వ వార్డు తూర్పు, పడమర 20 అడుగుల రోడ్డు, కొంత అసైన్డ్ భూమి కబ్జాకు గురైందని ఆ ప్రాంత వాసులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. రహదారి స్థలం కావడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. కబ్జాకు గురైన స్థలంలో గేదెలు, ఆవుల షెడ్లు, గడ్డి వాములు, పక్కా బిల్డింగులు నిర్మించారని, అయినప్పటికీ అధికారులు చోద్యం చూస్తున్నారన్నారు. మున్సిపల్, రెవెన్యూ అధికారులు కబ్జాదారుడిపై చర్యలు తీసుకొని మున్సిపల్ రహదారిని, ఖరీదైన ప్రభుత్వ అసైన్డ్ భూమిని కాపాడాలన్నారు. రహదారిపై రాకపోకలు సాగించే పట్టణ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



సత్తెనపల్లి: ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణ రఘురాంనగర్‌లోని తన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా ప్రజల నుంచి వినతులను శుక్రవారం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ ప్రజలు తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వినతి పత్రాలు అందించారని, పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తారని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా తన దృష్టికి గృహ, పెన్షన్, వైద్యం, ఇలా పలు సమస్యలు తీసుకొచ్చారన్నారు. ఆ సమస్యల తక్షణ పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశానని, అందరి సమస్యలు పరిష్కరించి ఈ ప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఉన్నానన్నారు.

వరిలో పంట కోత ప్రయోగం



బెల్లంకొండ: మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామంలో శుక్రవారం వరి పైరులో పంట కోత ప్రయోగాన్ని నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి డి.కృష్ణయ్య తెలిపారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా రైతు యాకసిరి రవికి చెందిన పొలంలో పైరును పరిశీలించినట్లు తెలిపారు. 5–5 మీటర్ల విస్తీర్ణంలో పంట కోతను నిర్వహించి ధాన్యం నూర్పిడి చేయగా 14.200 కేజీల తడి ధాన్యం దిగుబడి వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధి గోపి, అగ్రికల్చర్ అసిస్టెంట్ అయ్యప్ప, రైతులు పాల్గొన్నారు.

ప్రగతి సీబీఎస్ఈ స్కూల్ రద్దు ప్రచారం నేరం

సత్తెనపల్లి: ప్రగతి (సీబీఎస్ఈ) స్కూల్ స్థానంలో రద్దయిన అమరావతి (స్టేట్ బోర్డు) స్కూలును ప్రారంభిస్తున్నట్లు ప్రగతి (సీబీఎస్ఈ) స్కూల్లో పని చేస్తున్న కొంత మంది ఉపాధ్యాయులు ప్రచారం చేస్తున్నారని, ఇది చట్టరీత్యా నేరమని ప్రగతి సీబీఎస్ఈ స్కూల్ డైరెక్టర్ డాక్టర్ మక్కెన అచ్చయ్య అన్నారు. సత్తెనపల్లిలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఇలా దుష్ప్రచారం చేసే వారందరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. 600 మంది ప్రగతి స్కూల్ విద్యార్థులు సీబీఎస్ఈ బోర్డుతో అనుసంధానమై ఉన్నారన్నారు. ఒక సీబీఎస్ఈ స్కూల్ రద్దు కావాలంటే కేంద్ర మానవ వనరుల శాఖ, రాష్ట్ర మానవ వనరుల శాఖ, సీబీఎస్ఈ బోర్డు (న్యూఢిల్లీ), సీబీఎస్ఈ రీజనల్ బోర్డు (విజయవాడ), విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, యాజమాన్యం అనుమతులు, ఆమోదం కావలసి ఉంటుందన్నారు. కాబట్టి తల్లిదండ్రులు ఈ దుష్ప్రచారాన్ని గమనించగలరని ఆయన కోరారు. ఆయనతో పాటు ప్రగతి సీబీఎస్ఈ స్కూల్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మక్కెన పద్మజ ఉన్నారు.

మలేరియా నిర్మూలనకు అందరు చేతులు కలపాలి

జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి రవి

అమరావతి: ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని అత్తలూరు పీహెచ్‌సీలో పల్నాడు జిల్లా మలేరియా నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మలేరియా అవగాహన ర్యాలీ, సమావేశం నిర్వహించారు. తొలుత అవగాహన ర్యాలీ నిర్వహించి అనంతరం జరిగిన సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి రవి మాట్లాడుతూ ఈ సంవత్సరం 'మలేరియా అంతం మనతోనే' అనే నినాదంతో ముందుకు వెళుతున్నామన్నారు. మలేరియా వ్యాధి నిర్మూలనకు అందరం చేయి చేయి కలపాలన్నారు. మలేరియా దోమల ద్వారా వ్యాప్తి చెందుతుందని దోమలు పుట్టకుండా కుట్టకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నకర్ మాట్లాడుతూ మలేరియా, డెంగీ వ్యాధులపై ప్రతి సచివాలయం వారీగా ఫీల్డ్ స్టాఫ్ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.శివ రత్న కుమార్, మౌనిక, సీహెచ్‌వో ఆనందరావు,అప్తాలా మిక్ఆఫీసర్ సుబ్బారావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ

పెదకూరపాడు : మలేరియా నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని 75 త్యాళ్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మౌనిక అన్నారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మౌనిక మాట్లాడుతూ మలేరియాకు కారకమైన దోమలను నివారించేందుకు తప్పనిసరిగా దోమ తెరలు వినియోగించాలని సూచించారు. ఇళ్లల్లోని పాత్రల్లో, నీటి కుంటల్లో నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలన్నారు. మలేరియా అంతం మనతోనే అనే నినాదంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది విజయకుమార్, దుర్గా కుమారి, దిలీప్ కుమార్, సుభాషిణి, గ్రేసమ్మ, పద్మజ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి రవి

ముప్పాళ్ళలో...

ముప్పాళ్ళ: మలేరియా పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా.గీతాంజలి చెప్పారు. పీహెచ్‌సీలో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. నీరు నిల్వ ఉండే తొట్లను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురుగు కాల్వలను శుభ్రం చేసుకున్నట్లయితే దోమలు వ్యాప్తి చెందకుండా ఉంటాయని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా దోమ తెరలు వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీ నుంచి ముప్పాళ్ళ వరకు ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి జయకృష్ణప్రవీణ్, సీహెచ్ఓ దస్తగిరి, సీనియర్ అసిస్టెంట్ ఉస్మాన్, ఆరోగ్య పర్యవేక్షకులు ఏ పీటర్‌డేమియన్, జోస్పిన్ రాణి, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

రాజుపాలెంలో...

రాజుపాలెం: ప్రజలలో మార్పు వచ్చి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే మలేరియా దానంతట అదే అంతమవుతుందని డాక్టర్ రవితేజనాయక్ తెలిపారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా మలేరియాపై ప్రజలకు అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. ఈ ర్యాలీలో డాక్టర్ రవితేజనాయక్ మాట్లాడుతూ మలేరియా అంతం కావాలంటే ప్రజల్లో మార్పు రావాలని అన్నారు. రాబోయే రోజుల్లో వర్షాలు కురుస్తాయి కావున ముందస్తుగా సైడు కాలువలు పూడిక తీత పనులు చేపట్టాలని తెలిపారు. గ్రామ వీధుల్లో నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, ఉషారాణి, కోటేశ్వరరావు, శివాంజనేయులు, రమాదేవి, చందన, ఆశా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

క్రోసూరులో...

క్రోసూరు: ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం క్రోసూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో క్రోసూరులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ మహమ్మద్ షాద్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఏప్రిల్ 25న 'ప్రపంచ మలేరియా దినోత్సవం' జరుపుకుంటామన్నారు. మలేరియా నిర్మూలన దిశగా 'రీ ఇన్వెస్ట్, రీ ఇమేజింగ్, రీ ఇగ్నైట్' అనబడే అంశాన్ని తీసుకొని అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యాంసన్ దోమల వ్యాప్తిని అరికట్టడానికి తీసుకోవలసిన చర్యలను వివరించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిలువ లేకుండా చూడాలని, నిల్వ ఉన్నచో వారానికి ఒకసారి కిరోసిన్‌గానీ వాడిన ఇంజన్ ఆయిల్ గానీ చల్లాలన్నారు. దోమ తెరలు వాడాలన్నారు. మలేరియా అంతం–మన పంతం, ఫ్రైడే–డ్రైడే, మలేరియా రహిత సమాజమే మనందరి బాధ్యత అంటూ నినాదాలతో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శివుడు, మేల్ స్టాఫ్ నర్స్, ఫార్మసిస్ట్ ఫాతిమా, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



క్రోసూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ

బెల్లంకొండలో...

బెల్లంకొండ: మలేరియా నిర్మూలన మన చేతుల్లోనే ఉందని చంద్రాజుపాలెం పీహెచ్‌సీ ఇన్‌చార్జ్ వైద్యాధికారి డా.సాయికృష్ణ తెలిపారు. శుక్రవారం పీహెచ్‌సీలో 'ప్రపంచ మలేరియా దినోత్సవం' సందర్భంగా మలేరియా నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యశాల సిబ్బంది గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. వైద్యులు సాయికృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి చుట్టుపక్కల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బాషా, ఫార్మసిస్ట్ శ్రీవల్లి, స్టాఫ్ నర్స్‌లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



త్యాళ్లూరులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



ముప్పాళ్ళలో మలేరియాపై అవగాహన ర్యాలీ



రాజుపాలెంలో మలేరియా నివారణపై అవగాహన ర్యాలీలో అరోగ్య సిబ్బంది



చంద్రాజుపాలెంలో పీహెచ్‌సీ వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

'సురక్షిత గ్రామ జ్యోతి'పై గ్రామ కార్యకర్తలకు శిక్షణ

పెదకూరపాడు : మహిళా శిశు సంక్షేమ శాఖ పెదకూరపాడు సెక్టార్ పరిధిలోని మూడో అంగన్‌వాడీ కేంద్రంలో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో సురక్షిత గ్రామ కార్యకర్తలకు 'సురక్షిత గ్రామ జ్యోతి' పై ఒకరోజు శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ల్యాంప్ సంస్థ కో ఆర్డినేటర్ కె.వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా మండల అభివృద్ధి అధికారి ఎస్.సోమయాజులు పాల్గొని మాట్లాడుతూ మైఛాయిస్, ల్యాంప్ సంస్థ నిర్వహిస్తున్న ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం సురక్షిత గ్రామాల కోసం పని చేస్తున్న గ్రామ స్థాయి కార్యకర్తలకు చాలా అవసరమన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, బాల్య వివాహాలు, గృహ హింస, మానవ అక్రమ రవాణా లాంటివి నిరోధించేందుకు కార్యకర్తలకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. క్రోసూరు ప్రాజెక్టు శిశు సంక్షేమ శాఖ బాలల అభివృద్ధి, రక్షణ అధికారి సరళ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా, గృహహింస, బాల్యవివాహాలు ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయన్నారు. గ్రామాల్లో కుటుంబ వ్యవస్థ బలోపేతంతో వీటిని అరికట్టగలమన్నారు. ల్యాంప్ సంస్థ కో ఆర్డినేటర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామ స్థాయిలో కార్యకర్తలు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో స్టేక్ హోల్డర్స్ పుస్తకాలను కార్యకర్తలకు ఉచితంగా పంపిణీ చేశారు. శిక్షకుడు బాజీ మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరూ మానవ అక్రమ రవాణాపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ లాంటి సోషల్ మీడియాకు ఎక్కువగా ప్రభావితులై అక్రమ రవాణాకు గురవుతున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మున్నీ, మహిళా పోలీసు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



శిక్షణలో సేఫ్ గ్రామాల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అధికారులు

తెగిన విద్యుత్ వైరు.. పట్టించుకోని సిబ్బంది

అచ్చంపేట: ఇటీవల వీచిన భీకర గాలులకు విద్యుత్ వైర్లు తెగి పది రోజులు కావస్తుందని, వైరులో విద్యుత్ సరఫరా అవుతుందని వెంటనే క్రమబద్ధీకరించాలని స్థానిక విద్యుత్ సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదని మండలంలోని పెదపాలెం గ్రామానికి చెందిన నల్లమోతు పాండురంగ కుమారస్వామి విలేకరులకు మొరపెట్టుకున్నారు. గ్రామంలోని పాటిమీద ఆంజనేయస్వామి దేవాలయం వద్ద గల తన భూమిలో ఈ నెల 16వ తేదీ తెల్లవారుజామును వీచిన గాలులకు తన పొలం నుంచి వెళ్లే విద్యుత్ వైరు తెగి కింద పడిందని, ఆ వైరు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు వినియోగిస్తారన్నారు. వైరు తెగి కింద పడిన విషయం గ్రామానికి చెందిన లైన్‌మెన్‌కి పలుమార్లు చెప్పానని అయినా పట్టించుకోలేదని చెప్పారు. వైరులో విద్యుత్ సరఫరా అవుతుందని, వైరుకు చుట్టూ నల్లటి స్లీవ్ ఉండటం వల్ల పెద్దగా ప్రమాదం చోటుచేసుకోలేదని తెలిపారు. లేకుంటే పొలాల్లో మేతకు వెళ్లే గేదలు ఈ పాటికి మృత్యువాత పడేవన్నారు. ఇప్పటికైనా విద్యుత్ సిబ్బంది స్పందించి వెంటనే తెగిన విద్యుత్ వైరును క్రమబద్ధీకరించాలని బాధిత రైతు నల్లమోతు పాండురంగ కుమారస్వామి కోరారు.



తెగి కింద పడిన విద్యుత్ వైరు

ప్రభుత్వ పాఠశాలలో విద్య.. బంగారు భవిత

నకరికల్లు: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని ఎంఈఓ–2 ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు శుక్రవారం సన్మానం చేసి అనంతరం నకరికల్లులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.నగేష్ మాట్లాడుతూ తమ పాఠశాలలో చదవిన ఎస్.శ్రీనిజ 585, వి.వెన్నెల 582, పి.మల్లిఖార్జున 581, ఎల్.లక్ష్మీప్రసన్న 577, షేక్ ఫర్జానా పర్వీన్ 565, యాస్మిన్ 557, నజ్మ 550.. ఇలా 550 మార్కులకు పైగా ఏడుగురు 500కు పైగా 15 మంది విద్యార్థులు సాధించారన్నారు. వారాంతపు పరీక్షలు, క్రీడలు, లైబ్రరీ, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ ఈ ఫలితాలకు తార్కాణమన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ కాసా మల్లిఖార్జునరావు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ బత్తిన మల్లిఖార్జునరావు, కె.వెంకటేశ్వర్లు, ఎం.అశోక్, టి.కిరణ్మయి, కె.ప్రేమకుమారి, సువర్ణరాజు, శివకుమారి, మేదరమెట్ల స్వామి, కె.వీరమ్మ, కె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



నకరికల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుపై అనుచిత వ్యాఖ్యలు తగదు

సీపీఎం సత్తెనపల్లి మండల కార్యదర్శి పెండ్యాల మహేష్

సత్తెనపల్లి: సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుపై ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు అనుచిత వ్యాఖ్యలు తగదని సీపీఎం సత్తెనపల్లి మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ అన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుపై ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణంరాజు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ శుక్రవారం సత్తెనపల్లిలో ఆయన మాట్లాడారు. ఉండి నియోజకవర్గ పరిధిలోని పాలకోడేరు గ్రామంలో ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న పేదల ఇళ్లను అన్యాయంగా రఘురామకృష్ణంరాజు కూల్చి వేసింది కాకుండా.. ప్రజల పక్షాన నిలబడి నిరాశ్రయులకు న్యాయం చేయాలని పోరాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజును వెంటనే రాజ్యాంగబద్ధ పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. పేదలను హింసించే రఘురామకృష్ణంరాజుకు, పేద ప్రజల కోసం ప్రాణలర్పిస్తున్న సీపీఎంని విమర్శించే హక్కు లేదన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఎక్కడ? పదవుల కోసం రోజుకొక పార్టీ కండువాలు మార్చే మీరెక్కడ? అని ప్రశ్నించారు. శ్రీనివాసరావుపై రఘురామకృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలు వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉగ్రదాడిని నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ

అమరావతి: జమ్మూకశ్మీర్ రాష్ట్రంలో పహల్గామ్‌లో ముష్కరుల చేతిలో ప్రాణాలు కోల్పోయిన పర్యాటకుల ఆత్మశాంతి కోసం శుక్రవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉభయ కమ్యూనిస్ట్ పార్టీల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాకిస్తాన్ ఉగ్రవాదుల దుశ్చర్యలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన దాడిని ఖండిస్తూ సీపీఐ నాయకులు బైరాపట్నం రామకృష్ణ, మునుగోడు శ్రీనివాసరావు, సీపీఎం నాయకులు బి.సూరిబాబు, మొహిద్దీన్ వలిలు ప్రసంగించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తోకల సూరిబాబు, దారా ప్రసాద్, సీపీఐ నాయకులు నండూరి జ్యోతి, మంత్రాలు, గాలం సాంబయ్య, ఎస్.జోజి, సీపీఎం నాయకులు ఎస్.వెంకటేశ్వరరాజు, కృష్ణ, వై.రవి పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో...

సత్తెనపల్లి: కశ్మీర్‌లోని పర్యాటక కేంద్రమైన పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రవాదుల దాడికి వ్యతిరేకంగా మండలంలోని ఫణిదం గ్రామంలో శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పిస్తూ ఈ దాడిని ఖండించారు. దేశ సమైక్యతను కాపాడుకుంటామని సీపీఎం ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో చనిపోయిన వారికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ గ్రామ కార్యదర్శి వంగర తులసీరామ్, మండల కమిటీ సభ్యులు రావూరి పూర్ణచంద్రరావు, సీపీఎం కార్యకర్తలు, గ్రామస్తులు ఉన్నారు.

నకరికల్లులో...

నకరికల్లు: ఉగ్రదాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్ అన్నారు. కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ మండలంలోని చేజర్ల గ్రామంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. గ్రామంలోని మసీదు సెంటర్ నుంచి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం సెక్రటేరియేట్ సభ్యుడు వై.రాధాకృష్ణ, కౌలు రైతు సంఘం మండల అధ్యక్షుడు జి.పిచ్చారావు, రైతు సంఘం నాయకుడు ఈవూరి అప్పిరెడ్డి, ఈవూరి లక్ష్మారెడ్డి, షేక్ దాదాసాహెబ్, నవాజ్ షరీఫ్, కొండానాయక్, రామాంజినాయక్, చట్టు కోటేశ్వరరావు, అవుల వెంకటేశ్వర్లు, దుర్గాబాయి, బాలమ్మబాయి పాల్గొన్నారు.

అచ్చంపేటలో...

అచ్చంపేట: దేశ సమైక్యతకు, దేశ ప్రతిష్టను ఇనుమడింపజేసేందుకు హిందూ, ముస్లింలు సోదర భావంతో మెలగాలని, భారతీయులంతా ఒక్కటేనన్న భావంతో ప్రవర్తించాలని ముస్లిం మైనారిటీ నాయకుడు షేక్ కమల్‌సైదా అన్నారు. కశ్మీర్ ఉగ్రవాద దాడుల్లో అమరులైన వారికి నివాళులర్పిస్తూ మండల కేంద్రం అచ్చంపేటలో శుక్రవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మౌలానా ఖలీద్, శాఖమూరి కోటిసత్యం, ఏలూరు వాసు, ఆర్యవైశ్య సంఘ మాజీ అధ్యక్షుడు అన్నవరపు శ్రీనివాసరావు, ముస్లిం మైనారిటీ నాయకులు షేక్ బీరువాల జాని, గ్రామ సర్పంచ్ షేక్ జాని, బాజీ అనుముల శేషగిరిరావు, నూతికట్టు శంకర్‌గుప్తా, గుండా సురేష్, తయ్యబ్, అడ్డగిరి మని తదితరులు పాల్గొన్నారు.

పెదకూరపాడులో...

పెదకూరపాడు : కశ్మీరులోని పహల్గాంలో ఉగ్రదాడిని ప్రతి భారతీయుడు ఖండించాలని యువజన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంటా గోపి అన్నారు. అమరులైన వారి ఆత్మకు శాంతి చేకూరాలంటూ యువజన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి పెదకూరపాడులో కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. ఉగ్రవాదుల దుశ్చర్యను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. నియోజకవర్గ యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పెర ఉదయ్ శంకర్, బంకా కోటి, వినయ్, దేవకుమార్, నాగబాబు, గోపి ఉన్నారు.



అమరావతిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం



చేజర్లలో కొవ్వొత్తుల ర్యాలీలో సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు



పెదకూరపాడులో కొవ్వొత్తుల ర్యాలీ



అచ్చంపేటలో కొవ్వొత్తుల ర్యాలీలో హిందూ, ముస్లింలు

కాపులంతా ఐక్యతతో ఉండాలి



అచ్చంపేట: రాష్ట్ర జనాభాలో అధిక శాతం ఉన్న కాపులంతా ఐకమత్యంతో ఉండి అన్ని రంగాల్లో రాణించాలని కాపునాడు జాతీయ అధ్యక్షుడు గాళ్ల సుబ్రమణ్యం అన్నారు. స్థానిక సాయిబాబా కల్యాణ మండపంలో గురువారం సాయంత్రం జరిగిన పెదకూరపాడు నియోజకవర్గ కాపునాడు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కాపునాడు జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీశెట్టి పార్థసారథి అధ్యక్షత వహించారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కమిటీలను పటిష్ట పరచుకోవాలని సుబ్రమణ్యం సూచించారు. అనంతరం పల్నాడు జిల్లాలోని సత్తెనపల్లి, పెదకూరపాడు, గురజాల నియోజకవర్గాలకు కాపునాడు, మహిళా కాపునాడు, యువ కాపునాడు కార్యవర్గాలను నియమించారు. కమిటీ బాధ్యులు సుమారు 80 మందికి నియామక ఉత్తర్వులను అందజేశారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా కాపునాడు అధ్యక్షుడు పోలిశెట్టి వెంకట సత్యనారాయణ, పలు ప్రాంతాల నుంచి వచ్చిన కాపునాడు సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి పోలేరమ్మ జాతర

బెల్లంకొండ: మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామంలో శనివారం నుంచి గ్రామ దేవత పోలేరమ్మ తల్లి జాతర మహోత్సవ కార్యక్రమం జరగనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలలో శనివారం అమ్మవారికి ప్రత్యేక జలాభిషేకాలు, ఆదివారం ప్రతి ఇంటి నుంచి బోనాల సమర్పణ, కుంకుమ బండ్ల ఊరేగింపు కార్యక్రమాలు ఉంటాయన్నారు. సోమవారం పూజా కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

రాష్ట్ర భవిష్యత్ కోసం ల్యాండ్ పూలింగ్‌కు సహకరించండి

ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



అమరావతి: రాష్ట్ర భవిష్యత్ కోసం ల్యాండ్ పూలింగ్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కోరారు. శుక్రవారం మండల పరిధిలోని వైకుంఠపురం, ఎండ్రాయి గ్రామాలలో భూ సమీకరణపై జరిగిన గ్రామ సభలో ఆయన పాల్గొని గ్రామస్తులతో మాట్లాడారు. తహసీల్దార్ దానియేల్ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ రాజధాని అమరావతి అభివృద్ధికి సహకరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. భూములు ఇచ్చే వారి హక్కులను రక్షిస్తూ పరిహారం, పునరావాసం కల్పిస్తామన్నారు. భూ సమీకరణపై ఉన్న అపోహలను నివృత్తి చేస్తూ ప్రజల భాగస్వామ్యంతోనే రాజధాని నిర్మాణం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రమణకాంత రెడ్డి, ఎమ్మార్వో డానియేల్ , ఎంపీడీవో పార్వతి, ప్రజాప్రతినిధులు, వైకుంఠపురం , ఎండ్రాయి గ్రామస్తులు పాల్గొన్నారు.

రేపటి నుంచి కార్యసిద్ధి ఆంజనేయస్వామి వార్షికోత్సవం

సత్తెనపల్లి: పట్టణంలోని నాగన్నకుంటలో వేంచేసియున్న కార్యసిద్ధి ఆంజనేయస్వామి దేవాలయ 11వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 27 నుంచి మే 1 వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయని కార్యసిద్ధి ఆంజనేయస్వామి భక్త సమాజం శుక్రవారం తెలిపింది. 27న ఉదయం 9 గంటలకు 108 బిందెలతో అభిషేకాలు, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు భజన కార్యక్రమం జరుగుతుందన్నారు. 28న ఉదయం 9 గంటల నుంచి విశేష పూజలు, రాత్రి 7 గంటల నుంచి 108 రకాల ప్రసాదాల నివేదన జరుగుతుందన్నారు. 29న ఉదయం 11 వేల తమలపాకులతో పూజ, రాత్రి సామూహిక గంధసింధూరార్చన జరుగుతుందన్నారు. 30న ఉదయం మల్లెపూలతో అర్చన, సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం జరుగుతుందన్నారు. మే 1న ఉదయం మామిడిపండ్లతో విశేష పూజ, హనుమాన్ చాలీసా పారాయణం జరుగుతాయన్నారు. రాత్రి 7 గంటల నుంచి 9 వరకు శ్రీకరుణాకర్ బృందంచే నృత్య రూపకం (చిన్నారులచే) జరుగుతుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

పర్యాటకులపై ఉగ్రదాడి నిఘా వైఫల్యమే

క్రోసూరు: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై పాకిస్తాన్ ఉగ్రవాదులు దాడి చేయడం నిఘా వైఫల్యమేనని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర హానరబుల్ చైర్మన్ గార్లపాటి దాసు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆనందంగా గడుపుతున్న పర్యాటకులపై విచక్షణా రహితంగా కాల్పులు జరపటం దుర్మార్గమైన చర్య అని అన్నారు. దేశ చరిత్రలో ఉగ్రవాదుల దాడి చీకటి రోజుగా మిగిలిపోతుందన్నారు. కోవిడ్ అనంతరం కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సాయుధ దళాలకు సంబంధించి ఎలాంటి రిక్రూట్‌మెంట్ జరపకపోవడం పాలకుల వైఫల్యమేనన్నారు. ఉగ్రవాదుల కాల్పుల్లో మరణించిన కుటుంబాల వారికి కేంద్ర ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి రూ.కోటి ఆర్థిక సాయం ఇచ్చి ఆదుకోవాలన్నారు. ఉగ్రవాదుల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పిస్తూ.. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటూ.. బాధిత కుటుంబాలకు అందరం అండగా ఉందామని దాసు అన్నారు.

మహిళలకు కుట్టు మిషన్‌లు పంపిణీ

నకరికల్లు: ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు మహిళల ఉపాధికి సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక ఎస్సీ కాలనీలో మంచినీటి పైపులైన్ ప్రారంభోత్సవంతో పాటు మహిళలకు కుట్టు మిషన్‌లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకరికల్లులోని ఇందిరమ్మ కాలనీలో రూ.9.80 లక్షలతో తాగునీటి పథకం పైపులైనులు నిర్మించి కుళాయిలు ఏర్పాటు చేశామన్నారు. మహిళల ఉపాధికి ఉచిత కుట్టు మిషన్‌లు పంపిణీ చేసి టైలరింగ్ ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభించామన్నారు. మృతి చెందిన కార్యకర్తల కుటుంబాలకు పార్టీ తరఫున ఆర్థిక సహాయం అందించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పరసా అంజమ్మ, మాజీఎంపీపీ నాగోతు శౌరయ్య, జెడ్పీటీసీ సభ్యుడు జూనెబోయిన హరీష్,సాగి శ్రీనివాసరావు, ఆరవపల్లి వెంకట్రావు, డీకొండ రామదాసు, రామారావు, గుజ్జుల పాలు, పాలాంజి పాల్గొన్నారు.